సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



హోరాహోరీగా ఎస్పీఎల్

'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో 'సాక్షి ప్రీమియర్ లీగ్' (ఎస్పీఎల్) రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు తొలి రోజు హోరాహోరీగా సాగాయి. -8లో..



రోబోల విప్లవానికి నాంది పలకాలి

వచ్చే సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు రోబోల విప్లవానికి నాంది పలకాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36.2/17.2

వాతావరణం

జిల్లాలో మంగళవారం 17.2 – 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లా పర్యటన

- జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యు స్టీల్ ప్లాంటుకు భూమి పూజ
- పులివెందులలో వివాహ రిసెప్షన్‌కు హాజరు కానున్న సీఎం



కడప సిటీ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒకరోజు జిల్లా పర్యటనకు బుధవారం రానున్నారు. ఈ నేపథ్యంలో ఆయన జమ్మలమడుగు, పులివెందుల నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విజయరామరాజు ముఖ్యమంత్రి పర్యటన వివరాలను మంగళవారం వెల్లడించారు. బుధవారం ఉదయం 9.00 గంటలకు తన నివాసం తాడేపల్లి నుంచి బయలుదేరి కడప ఎయిర్‌పోర్టుకు 10.15 గంటలకు చేరుకుంటారు. అక్కడ రూ. 8800 కోట్లతో 30 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించనున్న జేఎస్‌డబ్ల్యు స్టీల్ ప్లాంటుకు భూమి పూజ చేస్తారు. అనంతరం శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. అక్కడే మౌలిక సదుపాయాలపై సమావేశం నిర్వహిస్తారు. అక్కడి నుంచి 1.20 గంటలకు బయలుదేరి 1.40 గంటలకు పులివెందుల చేరుకుంటారు. పులివెందులలో ఎస్‌సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో బలరామిరెడ్డి కుమారుని వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. ఆ తర్వాత 2.40 గంటలకు పులివెందుల నుంచి బయలుదేరి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుని ప్రత్యేక విమానంలో 4.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

- జేఎస్‌డబ్ల్యు గ్రూపు సారధ్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు
- రూ.8800 కోట్లతో నిర్మాణానికి సన్నాహాలు
- తొలివిడతలో రూ.3300 కోట్లతో నిర్మాణ పనులు
- రూ.700 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సీమ నిరుద్యోగ సమస్యకు ఫుల్‌స్టాప్
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నేడు భూమి పూజ

2019లో స్టీల్ ప్లాంట్ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగమోహన్‌రెడ్డి, తదితరులు (ఫైల్)




కడప సిగలో కలికితురాయి

సాక్షి ప్రతినిధి, కడప: రాయలసీమ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరే రోజు ఆసన్నమైంది. కడప సిగలో మరో కలికితురాయి వచ్చి చేరుతోంది. తన రాజకీయ భవిష్యత్తుకు అండగా నిలిచిన ప్రాంతం శాశ్వత అభివృద్ధి చెందాలనే సంకల్పం మొగ్గ తొడుగుతోంది. నిరుద్యోగాన్ని పారదోలి మెరుగైన జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ సంస్థ ద్వారా స్టీల్ ప్లాంట్ నిర్మించనున్నారు. తొలివిడతగా రూ.3,300 కోట్లతో 10 లక్షల టన్నుల సామర్థ్యంతో చేపట్టనున్న నిర్మాణ పనులకు గురువారం సున్నపురాళ్లపల్లి గ్రామం వద్ద భూమి పూజ చేయనున్నారు.

కడప గడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాలని విభజన చట్టంలో పొందుపర్చారు. తద్వారా నిరుద్యోగులకు ప్రత్యక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని సంకల్పించారు. అలాగే అనుబంధ పరిశ్రమల ద్వారా వేలాది మందికి జీవనోపాధి లభిస్తుందని భావించారు. గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించింది. అయితే ఎన్నికలకు ముందు 2018లో ఓ పునాది రాయితో చంద్రబాబు సర్కార్ సరిపెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్టీల్ ప్లాంట్ నిర్మించాలనే ఆశయాన్ని భుజానికెత్తుకుంది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 డిసెంబర్ 23న స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్ పేరిట నిర్వహణకు సన్నాహాలు చేపట్టారు. కాగా 2020 ఫిబ్రవరి నుంచి కరోనా వైరస్ వ్యాప్తితో ప్రపంచమే అతలాకుతలమైంది. ప్రజలు బతుకు జీవుడా అంటూ తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రెండేళ్ల పాటు ఇలాంటి పరిస్థితి కొనసాగడం వల్ల తక్షణ నిర్మాణానికి ప్రతిబంధకంగా మారిందని నిపుణులు వివరిస్తున్నారు.

▶▶ జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్‌చే భూమి పూజ..

చెప్పిన మాట ప్రకారం జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ ద్వారా స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ డిసెంబర్‌లో జిల్లా పర్యటన సందర్భంగా జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ ద్వారా జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు జీఓ ఎంఎస్ నంబర్ 751 ద్వారా ఎకరం రూ.1.65 లక్షలతో 3,148.68 ఎకరాలు కేటాయిస్తూ 2022 డిసెంబర్ 16న ఉత్తర్వులు జారీ చేశారు. తొలివిడతలో ఏడాదికి 1 మిలియన్ టన్నులు (10లక్షల టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి జేఎస్‌డబ్ల్యు సిద్ధమైంది. అందుకోసం ఫేజ్–1లో రూ.3,300 కోట్లు వెచ్చించి, 36 నెలల కాలపరిమితిలో ఫేజ్–1 పనులు పూర్తి కానున్నాయి. తొలివిడత ప్లాంట్‌లో వైర్ రాడ్స్, బార్ మిల్స్ ఉత్పత్తి చేయనున్నారు. మరో రూ.5,500 కోట్లతో ఫేజ్–2 నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. ఫేజ్–2 సైతం మార్చి 31, 2029 నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.



▶▶ మౌలిక వసతులు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.720 కోట్లు వెచ్చిస్తోంది. నాలుగులేన్ల రహదారి, రైల్వే కనెక్టివిటీ, నీటి వసతి కోసం పైపు లైన్ ఏర్పాటు, నిల్వ చేసుకునేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్, భవన సముదాయం నిర్మించనున్నారు. అందులోభాగంగా ఎన్‌హెచ్–67 నుంచి ముద్దనూరు టు జమ్మలమడుగు రోడ్డుకు అనుసంధానంగా రూ.145.3 కోట్లు తో 12 కిలోమీటర్లు నాలుగు లేన్ల రహదారి నిర్మించనున్నారు. అలాగే ఎర్రగుంట్ల టు ప్రొద్దుటూరు రైల్వే లైన్ నుంచి రూ.323.5 కోట్లతో 9.4 కిలోమీటర్లు రైల్వేలైన్ నిర్మాణం చేపట్టనున్నారు. మైలవరం జలాశయం నుంచి 2 టీఎంసీల నీరు సరఫరా చేయనున్నారు. అందుకోసం 15 కిలోమీటర్లు పైపులైన్ నిర్మించనున్నారు. ఇప్పటికే విద్యుత్ సరఫరాకు కావాల్సిన చర్యలు పూర్తి అయ్యాయి. రూ.76.42 కోట్లతో 27 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైన్ ఏర్పాటు, 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయింది. 20 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన సంప్ నిర్మాణం పూర్తయింది. ప్రహరీ, భవన సముదాయం వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. అంతర్గత రోడ్డు పనులు పూర్తి అయ్యాయి. గురువారం జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ ప్రతినిధులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు.

మాటకు కట్టుబడి స్టీల్‌ప్లాంట్‌కు భూమిపూజ

- ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



సభా వేదిక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు: ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన ఆరునెలల్లోనే స్టీల్ ప్లాంట్‌కు భూమిని కేటాయించడంతోపాటు భూమి పూజ చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కన్యతీర్థం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 డిసెంబర్‌లో స్టీల్‌ప్లాంట్‌కు శిలాఫలకం వేసిన తర్వాత కరోనా ప్రభావం చేత రెండు సంవత్సరాల పాటు పనులు నిలిచిపోయాయన్నారు. తిరిగి కరోనా నుంచి కోలుకుంటున్న సమయంలో మంచి కంపెనీతో పనులు ప్రారంభించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ వేచి చూశారన్నారు. అందులో భాగంగా మొదటి విడతగా రూ.3300 కోట్లతో జిందాల్ కంపెనీ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించే విధంగా జిందాల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని బుధవారం ముఖ్యమంత్రి భూమి పూజ చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ సలహామండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మార్పల్ శ్రీను, హృషికేశవరెడ్డి, ముద్దనూరు మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ వేదికను పరిశీలించిన కలెక్టర్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్ ప్లాంట్ పనులకు భూమి పూజ చేయనున్న ప్రదేశంలోని వేదికను కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈనెల 15వ తేదీ బుధవారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష ఉంటుందని ఇంటర్ ఆర్ఐఓ రమణరాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ తప్పని సరిగా ఈ పరీక్షలను నిర్వహించాలన్నారు. ఈ పరీక్ష ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు రాయకపోతే ఇంటర్‌లో అన్ని సబ్జెక్టులు పాస్ అయినా సరే ఫెయిల్‌తో సమానమే నన్నారు. కనుక ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఈ పరీక్షను తప్పనిసరిగా రాయాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలి

- జేసీ సీఎం సాయికాంత్ వర్మ



మాట్లాడుతున్న జేసీ సాయికాంత్ వర్మ

కడప సిటీ: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించాలని జేసీ సీఎం సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, డీఆర్వో గంగాధర గౌడ్‌తో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గతంలో జరిగిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో మార్చి 13వ తేదీన జరిగే.. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు కాని వారిని మాత్రమే నియమించాలన్నారు. వారి సొంత మండలం కానీ, వారు విధులు నిర్వహించే మండలానికి కానీ విధులు కేటాయించకూడదన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి.. ఆయా కేంద్రాలకు అదనపు భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, సీపీఓ వెంకట రావ్, డ్వామా, డీఆర్డీఏ, మెప్మా, ఏపీఎమ్ఐపీ, పీడీలు యదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్, రామ్మోహన్ రెడ్డి, రవీంద్రా రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ప్రగతికి తోడ్పాటు ఇవ్వండి



స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

- జగనన్న కాలనీల్లో నీటి సౌకర్యం
- బిల్లుల చెల్లింపులో జాప్యం కూడదు
- పీహెచ్‌సీల్లో రాత్రివేళ వైద్యులు ఉండాలి
- ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరగాలి
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజాప్రతినిధులు, అధికారులు తోడ్పాటు నందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీలోని తన చాంబర్‌లో నిర్వహించిన గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, ప్రణాళిక, ఆర్థిక, పనుల స్థాయి సంఘాల సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించారు. పలు అంశాలపై సభ్యులు లేవనెత్తిన సమస్యలకు సంబంధిత అధికారులు జవాబు ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్తగా చేపట్టాల్సిన పనులను ప్రకటించడం లేదన్నారు. జగనన్న కాలనీల్లో తాము ఇల్లు నిర్మించుకున్నప్పటికీ బిల్లుల చెల్లింపులో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారన్న విమర్శలు లబ్ధిదారుల నుంచి వినిపిస్తున్నాయని తెలిపారు. ఇక మీదటనైనా బిల్లులు సకాలంలో చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణం వేగంగా, సకాలంలో పూర్తయ్యేందుకు వీలుగా నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పైపులైన్లు వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఒక్కో గ్రామ పంచాయతీకి ప్రభుత్వం రూ. 20 లక్షలు చొప్పున ఇస్తోందని, ఇలా వచ్చిన రూ. 24 కోట్లతో 655 పనులు జరుగుతున్నాయన్నారు. సచివాలయాల నిర్మాణంలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు రాత్రి పూట కూడా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డెలివరీలు జరిగే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం కింద గ్రామీణులకు నెలలో రెండుసార్లు వైద్య సేవలు అందించాలన్నారు. రిమ్స్‌లో ప్లేట్ లెట్స్ చికిత్స అందుబాటులో ఉందని కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా అడిగిన ప్రశ్నకు అదనపు డీఎంహెచ్ఓ సమాధానమిచ్చారు. పెనగలూరు మండలం ఎస్ఆర్ పురం గ్రామానికి ఆర్టీసీ నైట్ సర్వీసు సౌకర్యం కల్పించాలని, కొత్తపల్లె గ్రామానికి ఒక బస్సు ఏర్పాటు చేయాలని ఆ మండల జెడ్పీటీసీ సుబ్బరాయుడు కోరారు. తక్షణమే బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డికి జెడ్పీ చైర్మన్ సూచించారు. ఇంకా పలువురు సభ్యులు వివిధ అంశాలు ప్రస్తావించారు. జెడ్పీ వైస్ చైర్మన్ టి.బాలయ్య అధ్యక్షతన వ్యవసాయ స్థాయి సంఘం, మరో వైస్ చైర్మన్ జె.శారద అధ్యక్షతన మహిళా సంక్షేమ స్థాయి సంఘం, చిట్వేలి జెడ్పీటీసీ సి.పుష్పలత అధ్యక్షతన సాంఘిక సంక్షేమ స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఇతర జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే మెరుగైన ఆరోగ్యం

సైకిల్ ర్యాలీ ప్రారంభోత్సవంలో డీఎంహెచ్ఓ నాగరాజు



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

కడప రూరల్: శారీరక శ్రమతో కూడిన వ్యాయామంతోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యమేళా వారోత్సవాల సందర్భంగా ఆరోగ్యానికి భరోసా–ప్రగతికి నాంది అనే నినాదంతో మంగళవారం స్థానిక మున్సిపల్ హైస్కూలు వద్ద సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ఐఎంఏ హాలు, అప్సర సర్కిల్, గాంధీనగర్ హైస్కూలు, మహావీర్ సర్కిల్ వరకు సాగింది. సైకిల్ ర్యాలీతోపాటు యోగా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ సైక్లింగ్, యోగా తదితర శారీరక శ్రమతోకూడిన వ్యాయామం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. గుండె జబ్బులు, కేన్సర్ తదితర వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. షుగర్, బీపీలను నియంత్రణలో ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే అధిక బరువు నుంచి విముక్తి పొందవచ్చన్నారు. ఈ శారీరక శ్రమ వల్ల మంచి నిద్ర పట్టడం ద్వారా మానసికంగా, శారీరకంగా, ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్, డాక్టర్ ఎ.శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మన భవిష్యత్

- మళ్లీ ఆయన్ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలి
- గృహసారథులు, కన్వీనర్ల పాత్రే ఇందులో కీలకం
- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: మన భవిష్యత్, భావి తరాల భవిష్యత్ బాగుండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ ఆడిటోరియంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబుతో కలిసి నిర్వహించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయిన తర్వాత మార్చి 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ ఏడు రోజుల పాటు 'జగనన్నే మన భవిష్యత్' పేరుతో మనం ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. ఇందు కోసం వలంటీర్ల సహకారం తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబంతో 15 నిమిషాలు మాట్లాడాలన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో ముద్రించిన కరపత్రాలను వారికి ఇవ్వడంతోపాటు, గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలు గురించి వివరించాలన్నారు. చదువు రాని వారికి చదివి వినిపించాలన్నారు. అలాగే ఒక రూపాయి లంచంతో పనిలేకుండా సంక్షేమ పథకాలు ఇంటికి చేరవేస్తున్న వైనంపై 5 ప్రశ్నలను వారిని అడిగి సమాధానాలు తెలుసుకున్న తర్వాత వారికి స్లిప్ ఇచ్చి మిస్డ్ కాల్ ఇప్పించాలన్నారు. వారి అనుమతితో ఆ ఇంటికి స్టిక్కర్లు అతికించాలన్నారు. ప్రభుత్వం ఎంత మంచి చేస్తున్నా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయని, అందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఒంటరిగా పోటీ చేసి గెలిచే దమ్ము, ధైర్యం ప్రతిపక్షాల్లో ఏ పార్టీకి లేదన్నారు. లోకేష్ పాదయాత్రకు ఆదరణ కరువైందని, ప్రజలు మొహం చాటేస్తున్నారన్నారు. జయంతికి, వర్ధంతికి, జీవోకు జియోకు తేడా తెలియని లోకేష్ కాబోయే నాయకుడినని పాదయాత్ర చేయడం హాస్యాస్పదమన్నారు. 151 అసెంబ్లీ, 23 ఎంపీ స్థానాలను ఒంటి చేత్తో గెలిపించిన ప్రజాదరణ గల ముఖ్యమంత్రిని లోకేష్ ఏకవచనంతో సంభోదిస్తూ మాట్లాడటం దారుణమన్నారు. ఇక పవన్ కల్యాణ్ హాలిడే ట్రిప్‌కు వచ్చినట్లు ఏపీకి వచ్చి షో చేసి పోతారన్నారు. కుల మతాలకు అతీతంగా పదవులు, సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రిని మళ్లీ మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, పార్టీ నాయకులు అహమ్మద్‌బాషా, బంగారు నాగయ్య, డిష్ జిలాన్, షఫీ, అజ్మతుల్లా, జఫ్రుల్లా, చెన్నయ్య పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



పవన్‌కుమార్



జి.వలరాజు

ప్రొద్దుటూరు : స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో మంగళవారం 19వ జిల్లా మహాసభల సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఆమోస్, లక్ష్మణ్, సతీష్, ప్రధాన కార్యదర్శి జి.వలరాజు, సహాయ కార్యదర్శులుగా అశోక్, శరత్, మురళితోపాటు కోశాధికారిగా లీలాకృష్ణను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి


వెంకటరామయ్య మృతదేహం

కాశినాయన : మండలంలోని పాత ఉప్పలూరు గ్రామానికి చెందిన బోయిన వెంకటరామయ్య (55) అనే జాలరి చేపలవేటకు వెళ్లి మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటరామయ్య గ్రామ సమీపంలోని సగిలేరులో సోమవారం చేపలకు వల వేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం సగిలేరుకు వెళ్లి వలను తీసుకొస్తానని ఇంటి వద్ద చెప్పి వెళ్లాడు. ఉదయం 10 గంటల వరకు ఇంటికి రాకపోవడంతో బంధువులు, గ్రామస్తులు వెళ్లి సగిలేరులో గాలించారు. అప్పటికే వెంకటరామయ్య సగిలేరులో మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. అతనికి ఈత కూడా బాగా వచ్చని, అయితే పక్షవాతం, గుండెపోటు జబ్బులు ఉన్నాయని, ఒకవేళ గుండెపోటు వచ్చి మృతిచెంది ఉంటాడేమోనని అనుమానం వ్యక్తం చేశారు. మృతునికి భార్య రంగమ్మతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాశినాయన ఎస్ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య


వెంకట ప్రతాప్‌రెడ్డి మృతదేహం

పోరుమామిళ్ల : మండలంలోని గానుగపెంట పంచాయతీ రేపల్లె గ్రామానికి చెందిన యువకుడు చవ్వా వెంకట ప్రతాప్‌రెడ్డి(28) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకట ప్రతాప్‌రెడ్డి కారు డ్రైవర్‌గా వెళుతుండేవాడు. సజ్జ పొలానికి ఆదివారం పురుగుల మందు కొట్టి మిగిలిన మందు అక్కడే ఉంచాడు. సోమవారం మద్యం తాగేందుకు మందు బాటిల్ తీసుకొని పొలం వద్దకు వెళ్లాడు. పొలం వద్ద మందు తాగుతూ అక్కడున్న పురుగుల మందు అందులో కలుపుకుని తాగాడు. మద్యంలో పురుగుల మందు కలవడంతో స్పృహ తప్పి పొలంలో పడిపోయాడు. బంధువులు గమనించి సోమవారం సాయంత్రం బద్వేలు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రిమ్స్‌కు తీసుకెళ్లారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయమై ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డిని విచారించగా ఇంకా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

హోరాహోరీగా ఎస్పీఎల్

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI MEDIA GROUP www.sakshi.com

- రీజినల్ స్థాయిలో తలపడిన అనంత, వైఎస్సార్, తిరుపతి, కర్నూలు, నంద్యాల జట్లు
- సీనియర్ విభాగంలో ఫైనల్స్‌కు చేరిన తిరుపతి, కడప జట్లు


ఫైనల్స్‌కు చేరిన తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టు


ఫైనల్స్‌కు చేరిన ప్రొద్దుటూరు ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల జట్టు


టాస్ వేసి అనంతపురం, తిరుపతి జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న 'సాక్షి' అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్


అనంత బౌలర్ చేతిలో క్లీన్ బౌల్డ్ అయిన తిరుపతి బ్యాటర్


ప్రొద్దుటూరు బ్యాటర్‌ను ఔట్ చేసిన ఆనందంలో కర్నూలు రాయలసీమ వర్సిటీ క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్ : 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో 'సాక్షి ప్రీమియర్ లీగ్' (ఎస్పీఎల్) రీజినల్ స్థాయి క్రికెట్ పోటీలు తొలి రోజు హోరాహోరీగా సాగాయి. అనంతపురం జిల్లాతో పాటు వైఎస్సార్, తిరుపతి, కర్నూలు, నంద్యాల జట్లు రీజినల్ స్థాయి పోటీలకు అర్హత సాధించగా... అనంత క్రీడాగ్రామం వేదికగా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సీనియర్ విభాగంలో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల (అనంతపురం) జరిగిన తొలి మ్యాచ్‌ను 'సాక్షి' అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్తమాన క్రీడాకారులకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. క్రీడల్లో ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించేవారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. మానసిక, శారీరక వికాసంతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సులువుగా దక్కించుకోవచ్చునన్నారు. కృషి, పట్టుదల, అంకితభావం, సాధన ఉంటే ఎలాంటి క్రీడలోనైనా రాణించవచ్చునన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకున్నప్పుడే క్రీడాకారుడికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో 'సాక్షి' ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, ఈవెంట్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు ఇలా..

- అనంత క్రీడాగ్రామంలోని హాకీ క్రీడామైదానం వేదికగా జరిగిన సీనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆర్ట్స్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు నిర్ణీత పది ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 110 పరుగులు సాధించింది. జట్టులో లేఖజ్ 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో బ్యాటర్ శశాంక్ 14 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 29 పరుగులు సాధించాడు. అనంతపురం బౌలర్లలో వినయ్ 3, భార్గవ్ 2 వికెట్లు దక్కించుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు నిర్ణీత పది ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 84 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో భార్గవ్ 14 బంతుల్లో 2 సిక్సర్లతో 22 పరుగులు, వినయ్ 14 బంతుల్లో 1 సిక్సర్, 1 ఫోర్‌తో 19 పరుగులు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. తిరుపతి బౌలర్ కార్తీక్ 1 వికెట్ సాధించాడు. 26 పరుగులతో తిరుపతి జట్టు విజయం సాధించింది.
- సీనియర్ విభాగంలో జరిగిన రెండో మ్యాచ్‌లో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల, కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ప్రొద్దుటూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. జట్టులో వెంకటేష్ 20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30 పరుగులు సాధించాడు. కర్నూలు బౌలర్లలో లోకేష్ 3, హరి 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 75 పరుగులకే పరిమితమైంది. జట్టులో జావీద్ 31 బంతుల్లో 2 సిక్సర్లు, 3 ఫోర్లతో 51 పరుగులతో అజేయంగా నిలిచాడు. కడప బౌలర్లలో సాయి సుధీర్ 1 వికెట్ సాధించారు. 4 పరుగుల తేడాతో ప్రొద్దుటూరు జట్టు విజయం సాధించింది.

నేడు సీనియర్ విభాగంలో ఫైనల్స్

సీనియర్ విభాగంలో ఫైనల్ మ్యాచ్‌ను సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు - వైఎస్సార్ జిల్లా) మధ్య బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు.

జూనియర్ విభాగంలో చెలరేగిన తిరుపతి బ్యాటర్లు

జూనియర్ విభాగంలో అనంతపురం జిల్లా నుంచి ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టుతో పాటు వైఎస్సార్ జిల్లా కడపలోని శ్రీసాయి ఐటీఐ కళాశాల, తిరుపతిలోని సీకామ్ జూనియర్ కళాశాల, నంద్యాలలోని ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్లు రీజనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించాయి.

- తొలి మ్యాచ్‌ను సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి), ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల)జట్ల మధ్య నిర్వహించారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నంద్యాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. జట్టులో అనిల్ 21 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 28 పరుగులు సాధించాడు. తిరుపతి బౌలర్లలో ధనుష్, జబిన్ చెరో వికెట్ కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు కేవలం 5.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో భరత్ 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 29 పరుగులు సాధించాడు. నంద్యాల బౌలర్లలో గోవర్ధన్ 1 వికెట్ కూలదోశాడు. 8 వికెట్లతో తిరుపతి జట్టు భారీ విజయాన్ని నమోదు చేసి, ఫైనల్స్‌కు చేరుకుంది.
- బుధవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల – ఆత్మకూరు (అనంతపురం), శ్రీసాయి ఐటీఐ కళాశాల – కడప (వైఎస్సార్) జట్ల మధ్య నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుతో తిరుపతి సీకాం జట్టు తలపడనుంది.

రోబోల విప్లవానికి నాంది పలకాలి

జిల్లా కలెక్టర్ విజయరామరాజు


సైన్స్ నమూనా గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల టౌన్ : వచ్చే సైన్స్‌ఫేర్‌లో రోబోల విప్లవానికి నాంది పలకాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ (మెయిన్) ఉన్నత పాఠశాలలోని సైన్స్‌ఫేర్ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయరామరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సైన్స్ లేనిదే ప్రపంచం లేదని... మన జీవన విధానంలో సైన్స్ ముఖ్య భాగమన్నారు. విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి ఎన్నో ఆవిష్కరణలు చేసి దేశ భవిష్యత్ కోసం ఆరాటపడాలన్నారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందన్నారు. ప్రపంచ దేశాలలో మన దేశం మేటిగా ఉండాలన్నారు. అనంతరం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు పథకం ద్వారా విద్యా రంగానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించి అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాలలను నిర్మించి విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారన్నారు. డీఈఓ దేవరాజు, జిల్లా సర్వశిక్షా అభియాన్ అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డిలు మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను వారు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సైన్స్‌ఫేర్‌లో ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్ విభాగంలో బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హరి జోష్మిత, హెల్త్ అండ్ క్లీన్‌నెస్ విభాగంలో కడపకు చెందిన ఎస్‌వీవీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్. గైబుషావల్లి, సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ విభాగంలో వనిపెంట ఏజేపీబీసీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కావ్య, ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజెస్ విభాగంలో మహదేవపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మంజు, మాథ్యమాటికల్ మోడలింగ్ విభాగంలో వేముల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మహమ్మద్ యాసిన్‌లు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు కలెక్టర్ విజయరామరాజు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఎంఈఓ వీరారెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు రాజు, అన్ని ప్రభుత్వ పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటకుల భద్రతకు పెద్దపీట

జిల్లా ఎస్పీ అన్బురాజన్


టూరిస్టు పోలీసుస్టేషన్ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్, కమ్యూనికేషన్ ఎస్పీ శారద

ఒంటిమిట్ట : పర్యాటకుల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. మంగళవారం రామాలయం వెనుకవైపు ఏర్పాటుచేసిన టూరిస్టు పోలీసు స్టేషన్‌ను వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కమ్యూనికేషన్ ఎస్పీ శారదతో కలిసి జిల్లా ఎస్పీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఒంటిమిట్ట, గండికోట ప్రాంతాల్లో టూరిస్టు పోలీసుస్టేషన్లు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీసులు సూచనలు ఇవ్వడంతోపాటు స్టేషన్‌లో నిరంతరం పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూదనరావు, సిద్ధవటం ఎస్ఐ నాగతులసీకుమార్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చు

కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్ : చిరుధాన్యాల సాగులో తక్కువ ఖర్చుతో అదనపు ఆదాయం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. మంగళవారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ముఖ్య కార్య నిర్వాహక అధికారులకు, పాలకవర్గ సభ్యులకు, సిబ్బందికి చిరుధాన్యాల పంటల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ఏ. వీరయ్య మాట్లాడుతూ భారత ప్రభుత్వం , రాష్ట్ర ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని, ఇది చిరుధాన్యాలు పండించే రైతులకు మంచి అవకాశం అన్నారు. సంవత్సరం పొడుగునా చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, రైతు సదస్సులు, క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చిరుధాన్యాల సాగు విస్తీర్ణంను పెంచాలని తెలిపారు.

ప్రమాదవశాత్తు మంటలు : ఐదు బైక్‌లు దగ్ధం


ప్రమాదంలో కాలిపోతున్న బైకులు

పులివెందుల : పట్టణంలోని కడప రోడ్డులో ఓ పెట్రోల్ బంకు సమీపంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో ఐదు బైకులు దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. మంగళవారం సాయంత్రం పెట్రోలు బంకు సమీపంలో కొంతమంది ప్రతిరోజు ఉదయాన్నే బైకులు పార్కింగ్ చేసి తమ విధులకు వెళ్లి తిరిగి సాయంత్రం బైకులను తీసుకొని వెళ్లేవారు. అయితే మంగళవారం సాయంత్రం బైకులు పార్కింగ్ చేసిన సమయంలో గడ్డి ఉండటంతో అక్కడ మంటలు చెలరేగాయి. గడ్డికి అంటుకున్న నిప్పు రవ్వలు సమీపంలోని బైకులపై పడటంతో ఐదు బైకులకు మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు స్థానిక అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా సంఘటనా స్థలానికి చేరుకున్న అర్బన్ సీఐ రాజు మంటలు ప్రమాదవశాత్తు వ్యాపించాయా లేక ఆకతాయిల పనా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు.

యువకుడిపై కేసు నమోదు

మైదుకూరు : మైదుకూరులోని జోసెఫ్ పేటకు చెందిన మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడనే ఫిర్యాదుతో ఓ యువకునిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు మంగళవారం తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మండలంలోని మిట్టమానుపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి అనే యువకునిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు.

రైతు పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప అగ్రికల్చర్ : రైతు పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. ఆచార్య యన్. జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లోని అభ్యుదయ రైతులకు గుర్తింపు ఇవ్వడం కోసం 2019 సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఉగాది పర్వదినాన రాష్ట్రస్థాయి పురస్కారాలు అందజేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, రూ. 5 వేలు నగదు అందజేస్తారన్నారు. 2022-23 సంవత్సరానికిగాను ఆసక్తి గల రైతు సోదర, సోదరీమణుల ఈ నెల 17వ తేదీలోపు తమ దగ్గరలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఏటీఎం దొంగ అరెస్టు


నిందితుడి అరెస్టువివరాలను తెలియజేస్తున్న కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏటీఎం కార్డులను ఉపయోగించి నగదును డ్రా చేసుకోవడానికి ఇబ్బందులు పడే అమాయకులు, వృద్ధులను టార్గెట్ చేసి వారిని మోసగించే దొంగను అరెస్టు చేసినట్లు కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడించారు. విజయవాడలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివిన కోనేటి వెంకటేశ్ చెడు మార్గాన్ని ఎంచుకుని డబ్బును అడ్డదారుల్లో సంపాదించి విలాసవంతంగా జీవించాలని భావించాడన్నారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఏటీఎం కార్డుల ద్వారానగదు డ్రా చేసుకోలేని అమాయకులను టార్గెట్ చేసి మోసగించేవాడన్నారు. చిన్నచౌకు , కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ల పరిధిలో ఆరుగురు వ్యక్తుల నుంచి ఏటీఎం కార్డులను తీసుకుని దొంగతనానికి పాల్పడ్డాడన్నారు. కడప రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్న సుబ్బరాయుడు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ ఎస్ఐ సిద్దయ్య ప్రత్యేక నిఘా ఉంచారన్నారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు పర్యవేక్షణలో అందిన సమాచారం మేరకు సిబ్బంది కడప ఔటర్ రింగ్‌రోడ్డులో బెంగుళూరు ఫ్లై ఓవర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వెంకటేశ్‌ను అరెస్టు చేశామన్నారు. 16 ఏటీఎం డెబిట్‌కార్డులు, ఒక మొబైల్ ఫోన్, రూ. 4 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

వీపీసీ వివాదంపై విచారణ ప్రారంభం

- విచారణకు హాజరుకాని డీడీ అచ్చెన్న
- బాధితులతోపాటు కార్యాలయ సిబ్బంది, పశుపోషకులు, సంఘ నాయకులను విచారించిన త్రిసభ్య కమిటీ
- నేడు కూడా కొనసాగనున్న విచారణ?


ఏడీ సురేంద్రనాథ్ బెనర్జీని విచారిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

కడప అగ్రికల్చర్ : జిల్లా బహుళార్థ పశువైద్యశాల(వీపీసీ) లో పనిచేసే అధికారుల మధ్య నెలకొన్న వివాదంపై మంగళవారం త్రిసభ్య కమిటీ విచారణ ప్రారంభించింది. ఈనెల 6వ తేదీన గేటుకు తాళం వేయడంతో వివాదం మొదలైంది. నాటి నుంచి నేటి వరకు విధులకు హాజరుకానివ్వడం లేదని ఒక వర్గం, సరెండర్ చేశాక విధులకు ఎలా హాజరవుతారని డీడీ వాదోపవాదాలు చేసుకుంటున్నారు. దీంతో మూగజీవాలకు సరైన వైద్యం అందక పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గత ఏడాది వీపీసీలో తలెత్తిన పలు కారణాలతో డీడీ అచ్చెన్నను సరెండర్ చేశారు. అదే కార్యాలయంలో పనిచేసే ఏడీ సురేంద్రనాథ్ బెనర్జీకి డీడీగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. అయితే అచ్చెన్న కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుని మళ్లీ బాధ్యతలు తీసుకున్నారు. బాధ్యతలు తీసుకునే విషయంలో వారి మధ్య వివాదం చోటు చేసుకుంది. తరువాత అచ్చెన్న ఏడీ సురేంద్రనాథ్‌బెనర్జీ, పశువైద్యులు సుభాష్ చంద్రబోస్‌లు విధులకు సక్రమంగా రావడం లేదంటూ వారిని సరెండర్ చేశారు. ఈ తరువాత మరో ఏడీ శ్రీధర్ లింగారెడ్డి, అటెండర్లు నాగలక్ష్మి, రమేష్‌లను కూడా సరెండర్ చేశారు. అయితే సరెండర్ చేసే అధికారం డీడీకి లేదని తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి శారదమ్మ డీడీకి నోటీసు ఇచ్చినా పట్టించుకోనట్లు తెలిసింది. ఈ విషయాన్ని శారదమ్మ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆశాఖ రాష్ట్ర డైరెక్టర్ విచారణకు త్రి సభ్య కమిటీని నియమించారు.

వీపీసీలో ప్రారంభమైన విచారణ

వీపీసీలో నెలకొన్న వివాదంపై మంగళవారం త్రిసభ్య కమిటీ సభ్యులైన అడిషనల్ డైరెక్టర్లు సింహాచలం, సత్యకుమారి, రజనీకుమార్‌లు వీపీసీని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. అయితే డీడీ అచ్చెన్న విచారణ కమిటీతో తాను ఈ రోజు విచారణకు హాజరుకాలేనని చెప్పి బయటకు వెళ్లి పోయినట్లు తెలిసింది. అయితే డీడీ అచ్చెన్న తాను అనారోగ్యం కారణంగా రిమ్స్‌లో వైద్య సేవలు పొందినట్లు ఔట్ పేషెంట్ స్లిప్‌ను విలేకరులకు వాటప్స్ గ్రూపులో పెట్టారు. జిల్లా పశువైద్యాధికారి శారదమ్మ చాంబర్‌లో జరిగిన విచారణలో తొలుత ఏడీలు సురేంద్రనాథ్‌బెనర్జీ, శ్రీధర్‌లింగారెడ్డి, పశువైద్యాధికారి సుభాష్‌చంద్రబోస్, అటెండర్లు నాగలక్ష్మి, రమేష్‌లను విడివిడిగా విచారించారు. అనంతరం పశుసంవర్ధకశాఖ అధికారుల సంఘం నాయకులు శ్రీనివాసులు, శ్రీధర్‌లింగారెడ్డి, కళ్యాణ్, చంద్రశేఖర్‌లతోపాటు పశువైద్యశాల సేవా సంఘం నాయకులు శివరామిరెడ్డి, సుధాకర్, లక్ష్మినరసయ్య, లీలాస్వర్ణ, హరికేశవరెడ్డిలను కూడా విచారించారు. అలాగే పలువురు పశుపోషకులను కూడా విచారించి వారు చెప్పిన విషయాలన్నింటిని నమోదు చేసుకున్నారు. విచారణ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. అయితే ఈ విచారణ బుధవారం కూడా కొనసాగనున్నట్లు తెలిసింది. విచారణ కమిటీతో పాటు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ పాల్గొన్నారు.